రాష్ట్రాల వారీగా కుల గణన చేపడితేనే న్యాయం

● మల్కాజిగిరి పార్లమెంటు సభ్యుడు ఈటల రాజేందర్

మన్సూరాబాద్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఒక్కో రాష్ట్రంలో ఒక్కో కులానికి చెందిన వారు ఉంటారని, కుల గణన కేంద్ర స్థాయిలో కాకుండా రాష్ట్రాల వారీగా చేపడితేనే కులాల దామాషా ప్రకారం అందరికీ అన్ని రంగాల్లో సమన్యాయం జరుగుతుందని మల్కాజిగిరి పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్ పేర్కొన్నారు. తెలంగాణ పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో ఆర్కేపురం డివిజన్‌లోని బాబూ జగ్జీవన్‌రామ్ భవన్‌లో ఆదివారం 'కుల గణన-శాస్త్రీయ అవగాహన'పై రాష్ట్ర స్థాయి సదస్సును నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర పద్మశాలీ సంఘం అధ్యక్షుడు వల్లకటి రాజ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఈటల రాజేందర్‌తో పాటు టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ విచ్చేసి మాట్లాడారు. ఈటల మాట్లాడుతూ బహుజనులకు సరైన న్యాయం జరగకపోవడంతో ఇప్పటికీ



సదస్సులో ప్రసంగిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆలోచన, ఆశయాలు తీరడంలేదన్నారు. మధుయాష్కీగౌడ్ మాట్లాడుతూ రాహుల్‌గాంధీ ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం కుల గణనను చిత్తశుద్ధితో చేపడుతున్నదన్నారు. దేశంలో ఎవరెవరు ఎంత మంది ఉన్నారో తేల్చాలని జనాభా ఆధారంగా దేశసంపదలో వాటాను అందించాలనేదే రాహుల్‌గాంధీ లక్ష్యమన్నారు. బహుజనులకు అన్ని రంగాల్లో న్యాయం జరగాలంటే కుల గణనకు ప్రజలంతా సహకరించాలని కోరారు. అదేవిధంగా మాజీ బీసీ కమిషన్ సభ్యుడు జూలూరి గౌరిశంకర్ కుల గణన శాస్త్రీయ అవగాహన, తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యుడు చలకాని వెంకట్‌యాదవ్ రిజర్వేషన్లతోనే బీసీల మనుగడ అనే అంశాలపై ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్ర పద్మశాలీ సంఘం అధ్యక్షుడు వల్లకటి రాజ్‌కుమార్, రాజకీయ విభాగం చైర్మన్ గుంటి నగేష్, మీడియా కమిటీ చైర్మన్ గుండా నర్సయ్య నిర్వహణలో జరిగిన ఈ సదస్సులో అఖిల భారతీయ విశ్వకర్మ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు కౌలె జగన్నాథం, సోషల్ జస్టిస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు చామకూర రాజులతో పాటు పలు బీసీ సంఘాల పెద్దలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



సీబీఐ కాలనీ కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

కాలనీల అభివృద్ధికి సహకరిస్తా : ఎమ్మెల్యే

వనస్థలిపురం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కాలనీల అభివృద్ధికి సహకారం అందజేస్తానని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ సీబీఐ కాలనీలో సొంత నిధులతో నిర్మించుకున్న కాలనీ కమ్యూనిటీ హాల్‌ను ఆదివారం ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీవాసులు సొంత నిధులతో కాలనీ కమ్యూనిటీ హాల్ ను నిర్మించుకోవడం అభినందనీయం అన్నారు. కాలనీవాసులు ఐక్యమత్యంగా ఉంటూ కాలనీ అభివృద్ధి కార్యక్రమంలో భాగస్వాములు కావడం ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి, సీబీఐ కాలనీ అధ్యక్షుడు ముప్పు సతీష్‌చౌదరి, కార్యదర్శి ఎం.శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షులు బి.పాణిరెడ్డి, జి.వెంకటేశ్, కోశాధికారి వై.మహేందర్‌రెడ్డి, నాయకులు సుమన్‌గౌడ్, మల్లేష్‌గౌడ్, రాంబాబు, రాఘవేందర్‌రావు పాల్గొన్నారు.



మాసబ్ చెరువులో చేప పిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే రంగారెడ్డి

మాసబ్ చెరువులో చేప పిల్లలను వదిలిన ఎమ్మెల్యే

హయత్‌నగర్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే రంగారెడ్డి చేతుల మీదుగా ఆదివారం తుర్కయంజాల్ మాసబ్ చెరువులో ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేసిన చేప పిల్లలను వదిలారు. ఈ కార్యక్రమంలో ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ సాయికుమార్, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ హరిత, కౌన్సిలర్లు కొశిక ఐలయ్య సునీల్, రవీందర్‌రెడ్డి, నాయకులు రాగ్యానాయక్, దర్శన్, శేఖర్‌గౌడ్, రాజశేఖర్, కుంట గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



కమ్మ వనమహోత్సవంలో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కమ్మ సంఘం పెద్దలు

కమ్మలు ఐక్యంగా ఉంటూ అన్ని రంగాల్లో రాణించాలి

మన్సూరాబాద్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కమ్మ కులస్థులు ఐక్యంగా ఉంటూ అన్ని రంగాలతో పాటు సేవా రంగాలలోనూ రాణించి ఇతరులకు ఆదర్శంగా నిలవాలని శేరిలింగంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ పేర్కొన్నారు. వనస్థలిపురం కమ్మ సేవా సంఘం ఆధ్వర్యంలో మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని జింకల పార్కులో ఆదివారం కార్తీక మాస వనభోజన మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యేతో పాటు శివశక్తి గ్రూప్ సంస్థల చైర్మన్ నందిగాం శ్రీనివాస్, బీఆర్‌కే న్యూస్ అధినేత బొల్లా రామకృష్ణ, దిల్‌సుఖ్‌నగర్ కమ్మ సంఘం అధ్యక్షుడు ఎస్వీ కృష్ణ ప్రసాద్‌లు విచ్చేసి ప్రసంగించారు. ఈ వేడుకలో భాగంగా ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు, నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సిద్ధార్థ విద్యాసంస్థల చైర్మన్ నాగయ్య, కమ్మ వరల్డ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కోడె బాబూరావు, డాక్టర్ ఎ.అనిల్, కమ్మ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పద్మశాలీలు సంఘటితంగా ఉండాలి

మన్సూరాబాద్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): పద్మశాలీలు సంఘటితంగా ఉంటూ అన్ని రంగాలలో రాణించాలని, కలిసి కట్టుగా ఉంటేనే ఏదైనా సాధ్యమని కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి పేర్కొన్నారు. మన్సూరాబాద్ పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం డివిజన్ పరిధిలోని పెద్దచెరువు ప్రాంగణంలో 11వ కార్తీక మాస పద్మశాలీ వనమహోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా నర్సింహారెడ్డి, మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డిలు విచ్చేసి పద్మశాలీల చేనేత రంగాలు, వృత్తుల సేవలను గురించి కొనియాడారు. పద్మశాలీ సంఘం డివిజన్ అధ్యక్షుడు గంజి సత్తయ్య నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు గంజి వెంకటేశం, ముఖ్య ఉపాధ్యక్షుడు లక్ష్మీనర్సింహ, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, ఉపాధ్యక్షులు సీతా వెంకటేశం, సుదర్శన్, భారతమ్మ, కార్యదర్శులు నర్సింహ, సాంబమూర్తి, సంతోష్ పాల్గొన్నారు.



నిరుపేదలకు రగ్గులు పంపిణీ చేస్తున్న డీఈ నీలిమ, భావన శ్రీనివాస్

అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేయాలి

వనస్థలిపురం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేయాలని శానిటేషన్ డీఈ నీలిమ అన్నారు. జాగృతి అభ్యుదయ సంఘం అధ్యక్షుడు భావన శ్రీనివాస్ ఆధ్వర్యంలో జ్ఞాన్‌శ్యామ్ బన్సల్, విమల్ బన్సల్‌ల సహకారంతో జీహెచ్ఎంసీ పారిశుధ్య కార్మికులకు, గుడిసెల్లో నివాసముండే నిరుపేదలకు ఆదివారం బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ గాయత్రినగర్‌లోని సాయిమందిరం వద్ద ఉచితంగా రగ్గులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జాగృతి అభ్యుదయ సంఘం కార్యదర్శి శ్రీరంగనాథ్, సాయిమందిరం కమిటీ ప్రతినిధులు సరస్వతి, పద్మ, సంతోషి, మాధవి, యాదగిరి, యాదయ్య పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి : రాగుల

వనస్థలిపురం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): డివిజన్ పరిధిలోని కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం వనస్థలిపురం డివిజన్ శక్తినగర్‌కాలనీలో కాలనీవాసులతో పాదయాత్ర చేపట్టి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మౌలిక సదుపాయాలు కల్పించాలని కాలనీవాసులు కార్పొరేటర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

సీపీఐ కౌన్సిల్ కార్యవర్గ సమావేశం

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ ఆర్ఎన్ఆర్ కాలనీలో ఆదివారం సీపీఐ అబ్దుల్లాపూర్‌మెట్ మండల సమితి ఆధ్వర్యంలో కౌన్సిల్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందోజు రవీంద్రచారి, సమితి సభ్యుడు ముత్యాల యాదిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిసెంబర్ 26తో పార్టీ ఏర్పడి 100 ఏళ్లు పూర్తవుతుందన్నారు. పార్టీ సభ్యత్వంతో పాటు ఆవిర్భావ దినోత్సవాలను ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు పబ్బతి లక్ష్మణ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు అజ్మీర్ హరిసింగ్‌నాయక్, నర్సింహ, వేణుగోపాల్, అరుణ, నవనీత, మధు, నారాయణరెడ్డి, పుల్లయ్య పాల్గొన్నారు.

పేదలకు ఆసరాగా సీఎంఆర్ఎఫ్ : రాజశేఖర్‌రెడ్డి



సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న రాజశేఖర్‌రెడ్డి

ఎల్‌బీనగర్ : ముఖ్యమంత్రి సహాయనిధి పేద ప్రజలకు ఆసరాగా ఉంటుందని జీహెచ్ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. లింగోజిగూడ డివిజన్ సాయిరాంనగర్‌కాలనీకి చెందిన బాలమణి కేన్సర్‌తో బాధపడుతున్నది. ఆస్పత్రిలో చికిత్స పొందిన ఆమె బిల్లులతో కార్పొరేటర్‌ని సంప్రదించింది. స్పందించిన ఆయన ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసి రూ. 39 వేలు మంజూరు చేయించారు. ఆ చెక్కును ఆదివారం బాలమణికి అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పలుసం శ్రీధర్‌గౌడ్, శివగౌడ్, కందికంటి శ్రీధర్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, వెంకట్, బాలరాజ్ పాల్గొన్నారు.

పెరికలు కలిసికట్టుగా అన్ని రంగాల్లో కదం తొక్కాలి

● రాష్ట్ర బీసీ సంక్షేమ, రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

మన్సూరాబాద్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): పెరిక కులస్థులంతా కలిసికట్టుగా ఉంటూ విద్య, వైద్య, సాంస్కృతిక, క్రీడా రంగాలతో పాటు రాజకీయ రంగాల్లోనూ కదం తొక్కాలని తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ, రోడ్డు రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర పెరిక(పురగిరి క్షత్రియ) కుల సంఘం ఎల్బీనగర్ జోన్ ఆధ్వర్యంలో మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని ఎంవీరెడ్డి గార్డెన్ ఫంక్షన్ హాలులో ఆదివారం పెరిక కుల కార్తీక వనభోజన మహోత్సవ ఆత్మీయ సమ్మేళనంను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి పొన్నం ప్రభాకర్ విచ్చేసి జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రసంగించారు. ఎల్బీనగర్ పెరిక సంఘం అధ్యక్షుడు సుందరి వీరభాస్కర్, ప్రధాన కార్యదర్శి ఆరెపూరి సత్యం ఆధ్వర్యంలో విచ్చేసిన అతిథులకు జ్ఞాపికను అందజేసి సన్మానించారు. అనంతరం చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించారు. ఈ వేడుకలో రాష్ట్ర పెరిక సంఘం అధ్యక్షుడు మద్దా లింగయ్య, ప్రధాన కార్యదర్శి భూసాని శ్రీనివాస్, గౌరవాధ్యక్షుడు శ్రీరాం భద్రయ్య, సంఘం పెద్దలు డాక్టర్ గటిక విజయ్‌కుమార్, వలిశెట్టి సత్యనారాయణ, దొంగరి మనోహర్, కందుల సంధ్యారాణి, పెరిక సంఘం నాయకులు, కులస్థులు పాల్గొన్నారు.



మంత్రి పొన్నంకు జ్ఞాపికను అందజేస్తున్న పెరిక సంఘం సభ్యులు

కులగణన సర్వే డేటా అప్‌లోడ్‌లో పొరపాట్లు జరగొద్దు

● ఎంట్రీ ఆపరేటర్లకు మేయర్ పారిజాత సూచన

సరూర్‌నగర్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కులగణనకు సంబంధించిన వివరాలను కంప్యూటర్లలో(ఆన్‌లైన్‌లో) అప్‌లోడ్ చేసేటప్పుడు ఎలాంటి పొరపాట్లు జరుగకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి ఆపరేటర్లకు సూచించారు. నాదర్‌గుల్‌లోని స్ఫూర్తి ఇంజనీరింగ్ కాలేజీలో ఏర్పాటు చేసిన డేటా ఎంట్రీ సెంటర్‌ను ఆదివారం కమిషనర్ పి.సరస్వతితో కలిసి ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా డేటా ఎంట్రీ తీరును పరిశీలించి, ఆపరేటర్లను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కులగణన సర్వే వేలాది కుటుంబాలతో ముడిపడి ఉన్న అంశం కాబట్టి వివరాలు అప్‌లోడ్ చేయడంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మునిసిపల్ వర్క్ ఇన్‌స్పెక్టర్ రాకేశ్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



కులగణన సర్వే డేటాను కంప్యూటర్లలో అప్‌లోడ్ చేస్తున్న కేంద్రాన్ని పరిశీలిస్తున్న మేయర్ పారిజాతారెడ్డి, కమిషనర్ సరస్వతి

మీర్‌పేట్‌లో కులగణన హెల్ప్‌డెస్క్: జ్ఞానేశ్వర్

మీర్‌పేట్ కార్పొరేషన్ కార్యాలయంలో కులగణన సర్వేకు సంబంధించి హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్టు కమిషనర్ ఆర్.జ్ఞానేశ్వర్ తెలిపారు. ఈనెల 9వ తేదీ నుంచి 23వ తేదీ వరకు ఇంటింటి సర్వే నిర్వహించి కుటుంబాల వివరాలు నమోదు చేశామని, కొన్ని నివాస గృహాలకు తాళం వేసి ఉండడంతో తమ సిబ్బంది సర్వే చేయలేక పోయారని ఆయన అన్నారు. అలాంటి వారి సౌకర్యార్థం హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని, సర్వేలో పాల్గొనని కుటుంబాల వారు హెల్ప్‌డెస్క్‌కు ఫోన్ చేసి చెబితే తమ సిబ్బందిని పంపిస్తామని కమిషనర్ పేర్కొన్నారు. ఈనెల 25,26,27 తేదీల్లో మూడు రోజుల పాటు ఈ డెస్క్ అందుబాటులో ఉంటుందని ఆయన చెప్పారు.

బీటెక్ విద్యార్థి ఆత్మహత్య

కొత్తపేట, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): చీరతో ఫ్యానుకు ఉరేసుకుని ఓ బీటెక్ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిని సంఘటన ఎల్బీనగర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌హెచ్‌ఓ వినోద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ వెల్దుర్తి మండలం పెద్ద తాడూరుకు చెందిన గడ్డం రమేష్, అంజనేయులు(20) అన్నదమ్ములు సెంట్రల్ బ్యాంకు కాలనీలో అద్దె గదిలో ఉంటున్నారు. అంజనేయులు మల్లేపల్లి భరత్ ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ 3వ సంవత్సరం చదువుతుండేవాడు. రమేష్, ఈ నెల 14వ తేదీన ఊరికి వెళ్లాడు. ఆదివారం మధ్యాహ్నం అతడు ఊరి నుండి వచ్చి చూసే సరికి సోదరుడు ఆంజనేయులు చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించాడు. వెంటనే అతడు పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఘటనా స్థలానికి చేరుకుని ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చంపాపేట చౌరస్తాలో తాగుబోతు వీరంగం..

● ఇటుకతో దాడి చేసేందుకు ట్రాఫిక్ పోలీసులపైకి వెళ్లి..

● తర్వాత కాళ్లు పట్టుకునే ప్రయత్నం..

● చివరికి సైదాబాద్ పోలీసులకు అప్పగింత..

చాదర్‌ఘాట్/సైదాబాద్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): చంపాపేట చౌరస్తాలో శనివారం రాత్రి డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తున్న మీర్‌చౌక్ ట్రాఫిక్ పోలీసులపై తాగుబోతు వీరంగం సృష్టించాడు. అంతటితో ఆగకుండా తన వాహనాన్ని ఎందుకు స్వాధీనం చేసుకుంటున్నారంటూ ట్రాఫిక్ పోలీసులపై ఇటుకతో దాడి చేసేందుకు ప్రయత్నించాడు. అంతలోనే ట్రాఫిక్ ఎస్ఐ కాళ్లు పట్టుకునే ప్రయత్నమూ చేశాడు. చివరికి ట్రాఫిక్ పోలీసులు తాగుబోతును సైదాబాద్ పోలీసులకు అప్పగించారు. సైదాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మీర్‌చౌక్ ట్రాఫిక్ ఎస్ఐ అమరేందర్‌రెడ్డి తన సిబ్బందితో శనివారం రాత్రి చంపాపేట చౌరస్తాలో డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తున్నాడు. ఇంతలో మద్యం మత్తులో ఉన్న వాహనదారుడు ట్రాఫిక్ పోలీసులకు పట్టుబడ్డాడు. అతన్ని తనిఖీ చేయగా మద్యం సేవించి ఉన్నట్లు వెల్లడైంది. అనంతరం అతను నడిపే వాహనాన్ని పరిశీలించగా నంబర్ ప్లేటు లేదు. వాహనానికి సంబంధించిన ధ్రువపత్రాలు కూడా లేకపోవడంతో పోలీసులు వాహనాన్ని స్వాధీనం చేసుకుంటుండగా తన తప్పేమి లేనప్పుడు తన వాహనాన్ని ఎందుకు తీసుకెళ్తున్నారం టూ రోడ్డుపై వీరంగం సృష్టించాడు. అంతటితో ఆగకుండా విధి నిర్వాహణలో ఉన్న ట్రాఫిక్ పోలీసులపై ఇటుకతో దాడి చేసేందుకు ప్రయత్నించాడు. అనంతరం ట్రాఫిక్ ఎస్ఐ అమరేందర్‌రెడ్డి కాళ్లు పట్టుకునే ప్రయత్నమూ చేశాడు. మద్యం మత్తులో ఎం చేస్తున్నాడో తెలియని స్థితిలో ఉన్న తాగుబోతు ఎవరు. ఏప్రాంతానికి చెందినవాడో తెలియకపోయింది. చివరకు ట్రాఫిక్ పోలీసులు తాగుబోతును సైదాబాద్ పోలీసులకు అప్పగించారు. మీర్‌చౌక్ ట్రాఫిక్ పోలీసుల ఫిర్యాదు మేరకు సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్ఐ వేధిస్తున్నాడంటూ సోషల్ మీడియాలో ఓ మహిళ పోస్ట్ వైరల్

● సివిల్ కేసులో జోక్యం చేసుకోలేమని చెప్పినందుకే అలా

● హయత్‌నగర్ సీఐ నాగరాజు వివరణ

హయత్‌నగర్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): భర్త వేధింపులపై ఫిర్యాదు చేయడానికి వెళ్లిన తనను హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు చెందిన ఎస్ఐ(సైదులు) ఫోన్‌లో వేధిస్తున్నాడని ఓ మహిళా సోషల్ మీడియాలో పెట్టిన పోస్టు వైరల్‌గా మారింది. సివిల్ కేసులో జోక్యం చేసుకోమని చెప్పినందుకు కక్ష గట్టి ఎస్ఐపై నిందలు మోపుతుందని హయత్‌నగర్ సీఐ నాగరాజు గౌడ్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మునగనూర్ ద్వారకామాయినగర్ కాలనీకి చెందిన పావని జూనియర్ న్యాయవాదిగా పని చేస్తుంది. పావని శ్రీకాంత్ (29)ను రెండో పెండ్లి చేసుకుందని పోలీసులు తెలిపారు. ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. తన భర్త శ్రీకాంత్ తనకు చెప్పకుండా కారు తీసుకుని అదృశ్యమైనాడని గత నెల 20వ తేదిన పావని హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. శ్రీకాంత్ కర్నూల్‌లో ఉన్నట్లు గుర్తించి అదే నెల 30వ తేదీన తీసుకుని వచ్చారు. శ్రీకాంత్ వద్ద ఉన్న కారును పావనికి ఇప్పించినట్లు సీఐ తెలిపారు. కారు శ్రీకాంత్ తల్లి పేరు మీద ఉండడంతో అందుకు సంబంధించిన ఈఎంఐలు శ్రీకాంత్ చెల్లిస్తున్నాడు. ఇదిలా ఉండగా కారుతో పాటు శ్రీకాంత్ వద్ద ఉన్న బంగారం, డబ్బులు కూడా ఇప్పించాలని తమపై ఒత్తిడి తెచ్చిందని సీఐ తెలిపారు. బంగారం, డబ్బుల విషయం సివిల్ వివాదం కనుక కోర్టుకు వెళ్లాలని తాము సూచించామని సీఐ తెలిపారు. అది దృష్టిలో పెట్టుకున్న పావని ఉద్దేశ పూర్వకంగా కేసును ఇన్వెస్టిగేషన్ చేస్తున్న సైదులుపై అసత్య ఆరోపణలు చేస్తున్నదని సీఐ నాగరాజుగౌడ్ వివరణ ఇచ్చారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినట్లు ఆయన తెలిపారు. ఇదిలా ఉండగా శనివారం పావని తన భర్త శ్రీకాంత్ ఆయన తమ్ముడు దుర్గప్రసాద్‌లు శారీరక వేధింపులకు గురి చేస్తున్నారని హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు బీఎన్ఎస్ 74, 75, 118(1) 351(2) ట/గి 3(5) సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మాల మాదిగలను విడదీసేందుకు మనువాదుల కుట్ర

● పావుగా మారిన మందకృష్ణ

● తెలంగాణ మాలల ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు బాలకిషన్

హయత్‌నగర్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో మాల, మాదిగల మధ్య శాశ్వత శత్రుత్వం పెంచడానికి మనువాదులు ఎస్సీ వర్గీకరణ పేరుతో కుట్ర చేస్తున్నారని తెలంగాణ మాలల ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు బేర బాలకిషన్ ఆరోపించారు. మనువాదులు మంద కృష్ణను పావుగా వాడుకుంటున్నారని అన్నారు. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ డిసెంబరు 1న హైదరాబాద్‌లో జరిగే సింహగర్జన బహిరంగ సభ పోస్టర్‌ను ఆదివారం తుర్కయంజాల్ చౌరస్తాలో బేర బాలకిషన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ రిజర్వేషన్లు ఎత్తి వేయాలనే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. తెలుగు రాష్ట్రాలలోని 59 ఉప కులాల మధ్య చిచ్చు రేపుతున్నారని అన్నారు. మాల, మాదిగల మధ్య శాశ్వత శత్రుత్వం పెంచడానికి మనువాదులు చేస్తున్న కుట్రగా అభివర్ణించారు. సభకు ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున మాల సోదరులు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో తుర్కయంజాల్ మాజీ ఉప సర్పంచ్ చెవుల దశరథ, కౌన్సిలర్ కదారి శ్రీలత అనీల్‌కుమార్, మాల బ్యాగరి కాటి కాపర్ల సంఘం నాయకుడు రవి శేఖర్, నరేందర్, శ్రీనాథ్, తావుల కార్తీక్, బాల్‌రాజ్, భాస్కర్, కృష్ణ, వెంకటేశ్, కార్తీక్, జంగయ్య, శ్రీనివాస్, అనీల్‌కుమార్ పాల్గొన్నారు.

మాలల సింహగర్జన సభను విజయవంతం చేయండి

చాదర్‌ఘాట్ : రాజ్యాంగ బద్ధంగా మాలల హక్కులు, రిజర్వేషన్ల సాధన కోసం డిసెంబరు 1న జింఖానా గ్రౌండ్‌లో నిర్వహించబోయే మాలల సింహగర్జన సభను విజయవంతం చేసేందుకు మలక్‌పేటలో ఉన్న దాదాపు 25వేల మంది మాల కుటుంబీకులు తమ ఇళ్లకు తాళం వేసి తరలివచ్చి విజయవంతం చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట యాక్షన్ కమిటీ చైర్మన్ మన్నే శ్రీధర్, కన్వీనర్ పి.బల్వంత్‌రావు పిలుపునిచ్చారు. ఆదివారం మూసారాంబాగ్‌లోని బాలమ్మ దానమ్మ బస్తీలో మలక్‌పేట మాల సంఘం వ్యవస్థాపకుడు ముప్పిడి బల్వంత్, అధ్యక్షుడు పి.నర్సింగ్‌రావుల ఆధ్వర్యంలో జరిగిన మాలల ముఖ్య సమావేశానికి వారు ముఖ్యఅతిథులుగా విచ్చేసి సభ కరపత్రాలను విడుదల చేశారు. మలక్‌పేట మాల సంఘం సలహాదారులు రాంచందర్, పవికుమార్, నిర్వాహకుడు వీరేష్, బాలరాజ్, మురళిమనోహర్, బాలచందర్ పాల్గొన్నారు.

హయత్‌నగర్‌లో కారు వదిలి రియల్టర్ అదృశ్యం



రాజేంద్రప్రసాద్

హయత్‌నగర్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): నార్సింగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కనిపించకుండా పోయిన వ్యక్తి హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కారు వదిలి అదృశ్యమైన సంఘటన వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మణికొండ నెక్నాపూర్‌కు చెందిన కామిరెడ్డి రాజేంద్రప్రసాద్(38) రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తాడు. రాజేంద్రప్రసాద్‌కు పుప్పాలగూడ శివాలయం వద్ద ఎస్ఎక్స్‌టీ ఇన్‌ఫ్రా రియల్ ఎస్టేట్ కంపెనీ ఉంది. 21వ తేది రాత్రి 9.30 గంటలకు రాజేంద్రప్రసాద్ కంపెనీలో టెలికాలర్‌గా పని చేసే స్వప్నకు ఫోన్ చేసి తన కారును హయత్‌నగర్‌లో పార్కు చేశాను. అందులోనే కారు తాళాలు, నా సెల్ ఫోన్ పెట్టి వెళ్తున్నాను. వాటిని తీసుకుని వచ్చి కంపెనీ వద్ద పెట్టమని ఆదేశించి వెళ్లిపోయాడు. రాజేంద్రప్రసాద్ గురించి చుట్టుపక్కల బంధువుల వద్ద విచారించినా ఫలితం లేకపోవడంతో కంపెనీలో అసోసియేట్ పార్టనర్‌గా పనిచేసే గురుకుమార్ నార్సింగ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కాగా ఆదివారం నార్సింగ్ పోలీసులు కేసును హయత్‌నగర్‌కు బదిలీ చేశారు. హయత్‌నగర్ పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

టీపీసీసీ లీగల్ సెల్ జాయింట్ కన్వీనర్‌గా శ్రీనివాస్‌యాదవ్ నియామకం

హైదరాబాద్ సిటీ, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): టీపీసీసీ లీగల్ సెల్, మానవహక్కులు, ఆర్టీఐ రంగారెడ్డి జిల్లా జాయింట్ కన్వీనర్‌గా శ్రీనివాస్‌యాదవ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా నియామక పత్రాన్ని మానవహక్కులు, ఆర్‌టీఐ చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్, టీపీసీ రంగారెడ్డి జిల్లా లీగల్ సెల్, చైర్మన్ బొడ్డు భిక్షపతిగౌడ్‌లు శ్రీనివాస్‌యాదవ్‌కు అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి జాయింట్ కన్వీనర్‌గా నియమించిన సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్‌కు ధన్యవాదాలు తెలిపారు.

రోడ్డు ఆక్రమించి యథేచ్ఛగా నిర్మాణం

మన్సూరాబాద్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ డి విజన్ ప్రగతినగర్ కాలనీని రోడ్ నంబర్.1లో ఓ ఇంటి యజమాని రోడ్డును ఆక్రమించి యథేచ్ఛగా నిర్మాణం చేపడుతున్నాడు. 40 ఫీట్లు ఉన్న రోడ్డులో సుమారు 12 ఫీట్లు ఆక్రమించి నిర్మాణం చేపట్టసాగడంతో అక్రమ నిర్మాణం చేపట్టరాదని పలుమార్లు తాము అడ్డుకున్నా పట్టించుకోలేదని కాలనీవాసులు పేర్కొన్నారు. ఈ విషయమై ఆన్‌లైన్ ద్వారా అధికారులకు సైతం ఫిర్యాదు చేశామని, దీంతో టౌన్‌ప్లానింగ్ ఏసీపీ సిబ్బందితో వచ్చి పరిశీలించి వెళ్లారన్నారు. అయినా సదరు నిర్మాణదారుడు తాము, అధికారులు చెప్పినా వినకుండా నిర్మాణాలు చేపడుతున్నాడని, దీంతో రాకపోకల్లో కాలనీవాసులకు ట్రాఫిక్ సమస్య తలెత్తే ప్రమాదం ఉందన్నారు. ఇతడిని అనుసరించి మిగితా వారు కూడా రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు చేపట్టే అవకాశం ఉందని, వెంటనే సదరు నిర్మాణాన్ని కూల్చివేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. కాగా ఈ విషయమై స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డికి సైతం వారు ఫిర్యాదు చేసి జోనల్ కమిషనర్‌కు సైతం ఫిర్యాదు లేఖను రాశారు. ప్రగతినగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జి.అరుణ్‌రావు, ఉపాధ్యక్షులు ఎస్.విద్యాసాగర్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి కె.సైదిరెడ్డి, సభ్యులు సీతారామ్‌బాబు, విశ్వేశ్వర్‌రావు, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



జిల్లెలగూడలో దొడ్డి కొమురయ్య విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే సబితారెడ్డి, మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు

దొడ్డి కొమురయ్య విగ్రహావిష్కరణ

సరూర్‌నగర్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్ జిల్లెలగూడలోని చందచెరువు కట్టపై కురుమ సంఘం ఆధ్వర్యంలో నెలకొల్పిన దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని ఆదివారం మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీమంత్రి పి.సబితారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల సంక్షేమం కోసం కొమురయ్య చేసిన పోరాటం ఆదర్శనీయమని అన్నారు. కార్యక్రమంలో మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్, డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్‌రెడ్డి, బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, కురుమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు క్యామ మల్లేశ్, కార్పొరేటర్లు పోరెడ్డి పద్మాబాస్కర్‌రెడ్డి, సిద్దాల లావణ్యబీరప్ప, లార్డ్ బీరప్ప, పద్మాఅంజయ్య, మౌనికాశ్రీశైలం, అనిల్‌కుమార్‌యాదవ్, ధనలక్ష్మీరాజ్‌కుమార్, నవీన్‌గౌడ్, రాజేందర్‌రెడ్డి, సురేఖారమేశ్ పాల్గొన్నారు.

మా ప్లాట్లను రెసిడెన్సియల్ జోన్‌లోకి మార్చండి

● సీఎంకు చాణక్యపురి ప్లాట్ ఓనర్స్ వినతి

సరూర్‌నగర్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): తమ ప్లాట్లు ప్రస్తుతం ఇండస్ట్రియల్ జోన్(హార్డ్‌వేర్ పార్క్)లో ఉన్నాయని, దానిని రెసిడెన్సియల్ జోన్‌లోకి మార్చి తమకు న్యాయం చేయాలని బాలాపూర్ మండలం నాదర్‌గుల్‌లోని చాణక్యపురికాలనీ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు అసోసియేషన్ అధ్యక్షుడు గుండవరం వేణుగోపాల్‌రావు ఆధ్వర్యంలో ఆయనకు వినతిపత్రం అందజేశారు. తమ ప్లాట్లలో ఇళ్లు నిర్మించుకోలేక, ఆర్థిక అవసరాలకు అమ్ముకోలేక ఇబ్బందులు పడుతున్నామని, ఈ దృష్ట్యా జోన్ మార్పిడి చేసి తమను ఆదుకోవాలని వేణుగోపాల్‌రావు సీఎంను కోరారు. దాదాపు మూడు వేల కుటుంబాలు ఇందులో బాధితులుగా ఉన్నారని సీఎంకు వివరించారు. దీనికి సీఎం స్పందిస్తూ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.



టీటీడీ బోర్డు మెంబర్ నన్నూరి నర్సిరెడ్డిని సన్మానిస్తున్న ఏపీఆర్ టెక్నాలజీ నిర్వాహకుడు చంద్రశేఖర్ తదితరులు

యువత స్వయం ఉపాధి రంగాలను ఎంచుకోవాలి

● టీడీపీ స్పోక్స్ పర్సన్, టీటీడీ బోర్డు సభ్యుడు నర్సిరెడ్డి

మన్సూరాబాద్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): యువత ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా స్వయం ఉపాధి రంగాలను ఎంచుకుని ఆర్థికంగా నిలదొక్కుకోవాలని టీడీపీ స్పోక్స్ పర్సన్, తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యుడు నన్నూరి నర్సిరెడ్డి సూచించారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధిలో నిర్వాహకుడు నకిరేకంటి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఏపీఆర్ టెక్నాలజీ సీసీ కెమెరాల సెంటర్‌ను ఆదివారం స్థానిక కార్పొరేటర్, జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డితో కలిసి నర్సిరెడ్డి ప్రారంభించారు. చంద్రశేఖర్ బంధువులు, మిత్రులు పాల్గొన్నారు.

సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు

కొత్తపేట, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసోత్సవాల్లో భాగంగా స్నేహపురి పద్మావతీ గోదా సమేత వేంకటేశ్వరాలయంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. తెల్లవారు జామున తొలుత పుబ్బా నక్షత్రం సందర్భంగా ప్రధాన ఆలయంలో గోదాదేవి అమ్మవారికి శాస్త్రోక్తంగా విశేష అభిషేకాలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని శ్రీనివాస కల్యాణ వేదిక వద్ద సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు.